నెల్లుట్లలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పెంబర్తి కళాతోరణం వద్ద స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

పెంబర్తి వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు వేచి ఉన్న మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

పెంబర్తిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు వస్తున్న పార్టీ శ్రేణులు, స్థానికులు

రైతులను కష్టాల పాల్జేసిన కాంగ్రెస్

- దేవాదుల ద్వారా సాగునీరు అందించలేని సీఎం రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరంపై నిరాధార ఆరోపణలు
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

లింగాలఘనపురం, మార్చి 31 : కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను కష్టాలపాల్జేశారని, గోదావరి జలాలను దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా పంటలకు విడుదల చేయడంలో విఫలమయ్యారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ధ్వజమెత్తారు. ఫలితంగా పంటలకు నీరందక జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి ఎండిపోయి రైతులు నష్టపోయారని తెలిపారు. ఆదివారం ఆయన నెల్లుట్ల వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. చేతకాని కాంగ్రెస్ దద్దమ్మ ప్రభుత్వం చేతులెత్తేసిన ఫలితంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా 47 టీఎంసీలను గత డిసెంబర్ 7నుంచి తీసుకునే అవకాశమున్నా రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకోలేదని పొన్నాల విమర్శించారు. జిల్లాలోని రిజర్వాయర్లను గోదావరి జలాలతో నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి సాగునీటి సమస్య ఏర్పడి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించి రైతులకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వంద రోజుల కాంగ్రెస్ పాలనలో చేసింది ఏమీ లేదన్నారు. ప్రతిసారీ కాళేశ్వరం ప్రాజెక్టును సాకుగా చూపుతూ రైతాంగాన్ని మోసం చేస్తోందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. కర్షకుల బాధలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకే ఉద్యమ నేత కేసీఆర్ రైతుల వద్దకొస్తున్నారని ఆయన వివరించారు. రాజకీయాలు ఓట్ల వరకే పరిమితం కావాలన్నారు. ఈ వంద రోజుల్లో ఏ ఒక్క హామీని రేవంత్ రెడ్డి అమలుచేయలేదని, ఆరు గ్యారెంటీలను గాలికే వదిలేశారని ఎద్దేవా చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, సేవెల్లి సంపత్, ఎంపీపీ చిట్ల జయశ్రీ, నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, ధర్మపురి శ్రీనివాస్, సుంకరనేని రఘు, బూడిద రాజేశ్వర్‌గౌడ్, తీగల సిద్ధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న కొడకండ్ల మండల నాయకులు

గులాబీ దళ పతికి ఘన స్వాగతం

- కేసీఆర్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ ద్వారం పెంబర్తి వద్ద నీరాజనం
- స్వాగతం పలికిన ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, నాయకులు

జనగామ రూరల్, మార్చి 31 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా గులాబీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సాగునీరందక దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో ఎండిపోయిన పంటపొలాలను పరిశీలించేందుకు ఆదివారం ఎర్రవల్లి నుంచి ప్రత్యేక వాహనంలో కేసీఆర్ వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ ద్వారం పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నాయకులు ఘన స్వాగతం పలికారు. 'జై కేసీఆర్...జైజై కేసీఆర్.. బీఆర్ ఎస్ జిందాబాద్..' అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. దారి పొడవునా కేసీఆర్ వాహనంపై పూలు చల్లుతూ మహిళలు నీరాజనం పలికారు. కేసీఆర్ ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ నాయకులను కేసీఆర్‌కు పరిచయం చేశారు. మరో వైపు రైతుల కష్టాలను తెలుసుకోవడం కోసం మాకోసం ఉద్యమ నేత కేసీఆర్ వచ్చారని మహిళలు చర్చించుకోవడం కనిపించింది. అన్నదాతలకు రైతుబంధు సాయం అందించిన నేత అని, గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకున్న మహానేత అంటూ కొనియాడారు. కేసీఆర్ పాలనలో వేసవిలోనూ చెరువుల్లో గోదావరి జలాలు నింపారని, కరువు లేకుండా చూశారని పలువురు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు వస్తున్నాయని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని పలువురు రైతులు చర్చించుకోవడం కనిపించింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశం, ఎంపీపీలు మేకల కళింగరాజు, గోవర్ధన్, జడ్పీటీసీ శ్రీనివాస్, నాయకులు బక్క నాగరాజు యాదవ్, డాక్టర్ రాజమౌళి, గద్దల నర్సింగరావు, మార్కెట్ మాజీ చైర్మన్లు బాల్దె సిద్ధిలింగం, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బండ పద్మ, బాల్దె విజయ, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ జనగామ, బచ్చన్నపేట మండలాల అధ్యక్షులు బైరగోని యాదగిరిగౌడ్, బొడిగం చంద్రారెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చినబోయిన రేఖ, జిల్లా నాయకులు ఇర్రి రమణారెడ్డి, బండ యాదగిరిరెడ్డి, పెద్ది రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, చందు పాల్గొన్నారు.

నెల్లుట్ల వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పూలు చల్లి ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

నెల్లుట్లలో కేసీఆర్‌కు నీరాజనం

లింగాలఘనపురం : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నెల్లుట్ల వద్ద పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. దేవరుప్పుల మండలానికి కేసీఆర్ వెళ్తున్నారని తెలుసుకున్న ప్రజలు ఉదయం 8గంటల వరకే జనగామ-సూర్యాపేట జాతీయ రహదారి వద్దకొచ్చారు. గులాబీ కండువాలు కప్పుకుని కేసీఆర్ వాహనం రాగానే పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బచ్చన్నపేట నుంచి తరలివెళ్లిన శ్రేణులు

బచ్చన్నపేట : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ మండల శ్రేణులు పెద్ద సంఖ్యలో పెంబర్తిలోని హైవే వద్దకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కనకయ్య, సర్పంచ్‌ల ఫో రం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, ఉపేందర్‌రెడ్డి, జావీద్, షబ్బీర్, సిద్ధులు, వేణుగోపాల్, అనిల్‌రెడ్డి, నర్సిరెడ్డి, సిద్ధారెడ్డి, కిష్టయ్య, ఫిరోజ్, మల్లారెడ్డి, కైసర్, నర్సింహులు, రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

స్టేషన్ ఘన్‌పూర్ : కర్షకుల కన్నీరు తుడిచి నేనున్నానని భరోసా ఇచ్చేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దేవరుప్పుల మండలానికి వచ్చిన సందర్భంగా మండలంలోని పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు వెళ్లారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఎన్నడూ బాగు పడలేదన్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెడుతున్నారని, వారి ఉసురు కాంగ్రెస్ పార్టీకి తగులుతుందన్నారు. కేసీఆర్ పాలనలో గుంట భూమి కూడా ఎండలేదని, పాడి పంటలతో రైతులు రాజులుగా మారారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరువు విలయతాండవం చేస్తున్నదన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 'కుడా' మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, బీఆర్ఎస్ జఫర్‌గఢ్ మండల అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం ధర్మసాగర్ మండల అధ్యక్షుడు కర్ర సోమిరెడ్డి, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ చందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశం, ఆకారపు అశోక్, కంసాని రాజిరెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : కేసీఆర్‌ను కలిసేందుకు తరలివెళ్తున్న శ్రేణులు

కొడకండ్లలో..

కొడకండ్ల : దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో సాగునీరందక ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రావడంతో మండలంలోని పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపు మేరకు పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ ఆధ్వర్యంలో వెళ్లారు.

ఆర్బీఐ వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని ప్రదర్శించాలి

జనగామ చౌరస్తా, మార్చి 31 : నేడు నిర్వహించే రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 89వ వార్షికోత్సవ వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ప్రదర్శించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 'ఆర్బీఐ చరిత్ర-అంబేద్కర్' ప్రచార వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మంద రమేశ్, ఎండబట్ల పరశురాములు, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

కొడకండ్ల, మార్చి 31 : బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం సోమవారం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మడికొండలో జరిగే సమావేశానికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరవుతున్నందున మండలంలోని పార్టీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

జనగామలో ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

జనగామ చౌరస్తా, మార్చి 31 : సీపీఎం నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఆదివారం కలెక్టర్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకునేందుకు శనివారం జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాను కలెక్టరేట్‌లో కలవడానికి సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డితో పలువురు వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో 'నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావు? ఏదైనా ఉంటే కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయాలని తెల్వదా? మీ పార్టీ నుంచి ఎన్నికల సమావేశాలకు వచ్చేటోడు ఎవడు వాడు? వాడికి తెలియదా ..? ' అని అనుచిత వ్యాఖ్యలు చేశారని రాపర్తి రాజు ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం పరిశీలించి కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇర్రి అహల్య, బూడిద గోపి, సుంచు విజేందర్, అజారుద్దీన్, బీరయ్య, కళ్యాణి, లింగం, వరలక్ష్మి, శ్రావణ్, సుగుణ, వెంకటేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

బల్దియా యాప్ చిత్రాలు

ఫొటో పాత కమిషనర్‌ది.. పేరు కొత్త కమిషనర్‌ది

వరంగల్, మార్చి 31 : బల్దియా అంటేనే నిర్లక్ష్యమని పేరు ఉంది. దానికి తగ్గట్టుగానే అధికారుల పనితీరు ఉంది. కొత్త కమిషనర్ వచ్చి నెల రోజులు కావొస్తున్నా బల్దియా మొబైల్ యాప్‌లో మాత్రం ఆమె ఫొటో అప్‌లోడ్ చేయలేదు. పాత కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా ఫొటో అలాగే ఉంది. మరో విచిత్రం ఏంటంటే యాప్‌లో రిజ్వాన్ బాషా ఫొటో కింద ప్రస్తుత కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పేరు ఉంది.



యాప్‌లో పాత కమిషనర్ ఫొటో, కొత్త కమిషనర్ పేరు

రోడ్డు ప్రమాదంతో ఇద్దరు యువకులు మృతి

బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

గీసుగొండ, మార్చి 31 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మండలంలోని మచ్చాపురం శివారు నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన పెయింటర్ మడికొండ ప్రభాకర్(27), డిగ్రీ విద్యార్థి ఇమ్మడి సామ్యేల్ (21) శనివారం సాయంత్రం బైక్‌పై వరంగల్‌లో ఉంటున్న తమ బంధువు ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున నర్సంపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వాహనదారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై జానీ పాషా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించారు. ప్రభాకర్ సోదరుడు రంజిత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రోడ్డు సైడ్ ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని, ప్రమాదానికి కారణమైన వాహనదారుడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ప్రభాకర్, సామ్యేల్(ఫైల్)

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కొడకండ్ల, మార్చి 31 : బైక్ అదుపుతప్పి పడిపోగా ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని హక్యతండాలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సున్నపు వెంకన్న(39) ఆదివారం హక్యతండా నుంచి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను చికిత్స కోసం స్థానికులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సున్నపు వెంకన్న (ఫైల్)

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాలకుర్తి, మార్చి 31: మండలంలోని గూడూరు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈరవెన్ను మాజీ సర్పంచ్ కొమురోజు సోమన్న ఆధ్వర్యంలో 1984-85 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బచ్చు శ్రీనివాసులు, ఎనగందుల భూపాల్‌రెడ్డి, పసునూరి నాగేశ్వర్, బెల్లి కుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, రోజ, రమణి, శారద, మంజుల పాల్గొన్నారు.

కళాకారుడిగా గుర్తించి ఎంపీ టికెట్ ఇవ్వాలి

జనగామ చౌరస్తా, మార్చి 31 : పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తనకు అవకాశం కల్పించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమ్మయ్య మాట్లాడుతూ ఎస్సీ సామాజికవర్గంలోని చిందు సంచార జాతికి చెందిన తనకు షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు పోటీ చేసే చోట స్థానం కల్పించాలన్నారు. ఈ ప్రాంత ప్రజల సహకారంతో దేశ వ్యాప్తంగా చిందు యక్షగానం ద్వారా ప్రజల మనసు గెలుచుకున్నానని పేర్కొన్నారు. ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ప్రధాన రాజకీయ పార్టీలను ఆయన కోరారు.

మాట్లాడుతున్న గడ్డం సమ్మయ్య

దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

కాజీపేట, మార్చి 31: తప్పుడు కాగితాలతో ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు దౌర్జన్యానికి పాల్పడిన గంకిడి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో సీఐ సుధాకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నక్సల్స్ పేల్చిన మందు పాతరలో మృతి చెందిన ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ గతంలో ప్రగతినగర్ కాలనీలో 266 గజాల ప్లాట్ కొనుగోలు చేశాడు. దాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశంతో జీవన్‌రెడ్డి, ప్రభాకర్‌రావు జీపీఏ హోల్డర్‌గా నమ్మించి గంకిడి శ్రీనివాస్ రెడ్డికి రిజిస్ట్రేషన్ చేయించారు. సంతోష్ కుమార్ బంధువు వేములపల్లి రవికుమార్ ఇటీవల ప్లాట్ వద్దకు రావడంతో ఆ స్థలం చుట్టూ ప్రహరీ కట్టి దానిపై శ్రీనివాస్‌రెడ్డి సెల్ నంబర్ రాసి ఉండడంతో ఫోన్ చేయగా మీ అసలు కాగితాలు తీసుకుని రావాలని చెప్పాడు. కాగితాలు తీసుకురాగా శ్రీనివాస్ రెడ్డి దౌర్జన్యంగా గుంజుకుని చంపుతానని బెదిరించినట్లు రవికుమార్ ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

శ్రీహరివి ఊసరవెల్లి రాజకీయాలు

- మాదిగలకు మొదటి శత్రువు కాంగ్రెస్
- వారిని రాజకీయంగా ఎదగకుండా అడ్డుకున్నది కడియం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

విలేకరులు సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

హనుమకొండ, మార్చి 31: కడియం శ్రీహరివి ఊసరవెల్లి రాజకీయాలని, మాదిగలకు మొదటి శత్రువు కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా, రాహుల్ గాంధీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వరకు మాదిగల ఓట్లు అడిగే హక్కును కోల్పోయారన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు స్థానం లేదనేది తేటతెల్లం అయ్యిందన్నారు. కాంగ్రెస్ నాయకులను మాదిగ పల్లెల్లోకి రాకుండా గో బ్యాక్ అంటూ అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అధిక శాతం మాదిగలు ఉన్న నాగర్‌కర్నూల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలను మాలలకు కేటాయించారన్నారు. అలాగే వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని సైతం బీఆర్ఎస్ నుంచి వచ్చి కాంగ్రెస్ కండువా కప్పుకోగానే బైండ్ల కులస్తులైన కడియం శ్రీహరి కూతురు కావ్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దీన్ని మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 40సంవత్సరాల రాజకీయ జీవితం అని గొప్పలు చెప్పుకొనే కడియం ఎంత స్వార్థపరుడో అర్థమైందని అన్నారు. మాదిగల సహకారంతో ఎమ్మెల్యే స్థాయి నుంచి ఉపముఖ్య మంత్రి వరకు ఎదిగిన కడియంను చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుతో తలదించుకొనే పరిస్థితి వచ్చిందన్నారు. పార్టీలోని తాటికొండ రాజయ్య, సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, అరూరి రమేశ్‌కు అన్యాయం చేసారని ఆరోపించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ కూలిపోయి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న కడియం రాత్రికి రాత్రే ప్లేట్ పిరాయించి మాదిగలకు వస్తుందనుకున్న వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని తన కూతురు కడియం కావ్యకు ఇప్పించుకొని మరో ద్రోహం చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి తలుచుకొంటే దొమ్మాటి సాంబయ్య, ఇందిరకు గాని వరంగల్ ఎంపీ స్థానం దక్కేదని అన్నారు. సమావే శంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ నాయకులు మంద రాజు మాదిగ, శంకర్ మాదిగ, చేతల రమేశ్ మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, రేణుకుంట్ల మహేశ్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఈస్టర్' వేడుకలు

జనగామ చౌరస్తా, మార్చి 31 : లోక రక్షకుడైన యేసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి లేచిన పవిత్రమైన రోజు 'ఈస్టర్' సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉన్నపుర, దిఅబండెంట్ లైఫ్, ఇమ్మానుయేల్, జియాన్, సెయింట్ పీటర్స్ అండ్ పాల్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ఆరాధన సేవలు నిర్వహించారు. యేసును స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. బైబిల్‌లోని వాక్యాలను పాస్టర్లు సందేశంగా వినిపించారు. కార్యక్రమంలో సంఘు కాపరులు పీ ఫిలిప్, జీ నర్సింగరావు, రవికుమార్, నల్లా జాన్, యోహాను, మోజెస్, జేమ్స్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షాలేము మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించిన క్రైస్తవులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో సోలోమాన్, రవిజాన్, స్వామిదాసు, మార్త, మార్క్, ఐర్మయ్య, ఆనందం, మరియమ్మ, సువార్త పాల్గొన్నారు.

జనగామ పట్టణంలోని ఉన్నపుర చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బచ్చన్నపేట చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

LEASE/ RENT
★HNK, ఆదాలత్ నుండి K.L.N రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్ (S.V.కాలనీ) రోడ్ నెం.5, 4 అంతస్తుల భవనం, ప్రతి ఫ్లోర్ 1650 Sft కిరాయి / లీజ్ కి ఇవ్వబడును. (New బిల్డింగ్) సంప్ర|| సెల్ : 9502879612
KMM-11619

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565